

ఏటీఎంనే ఎత్తుకెళ్లారు..!
దొంగలు ఏకంగా ఏటీఎంను ఎత్తుకెళ్లిన ఘటన బిచ్కుంద మండల కేంద్రంలో చోటుచేసుకుంది.
- 8లో ▸



అభివృద్ధికి కృషి..
అందరి సహకారంతో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.
- 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
34.6 /23.1
ఆకాశం మేఘావృతమవుతుంది. అడపా దడపా జల్లులు కురిసే అవకాశాలున్నాయి. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురియవచ్చు.

న్యూస్‌రీల్

నేడు కాసుల బాల్‌రాజ్ బాధ్యతల స్వీకరణ



బాన్సువాడ: ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన కాసుల బాల్‌రాజ్ బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. హైదరాబాద్‌లో కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం ఉదయం 11.30 గంటలకు బాధ్యతలు స్వీకరించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎంపీ సురేశ్ షెట్కార్, బాన్సువాడ, జుక్కల్ ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీకాంతారావు, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్ పాల్గొంటారని పేర్కొన్నారు.

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ వేడుకలు



కామారెడ్డి టౌన్ : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన రోడ్లపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త బస్టాండ్ ప్రాంతంలో పరిషత్ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి పృద్వీ తేజ, జిల్లా కన్వీనర్ రోహిత్, జిల్లా ప్రముఖ్ డీఎస్.గిరి, పట్టణ అధ్యక్షుడు అనిల్‌రెడ్డి, నాయకులు ఖలీల్, అల్తాఫ్, వెంకటేష్ పాల్గొన్నారు.

12వ తేదీలోపు హాజరు కావాలి

నిజామాబాద్ అర్బన్: గిరిరాజ్ డిగ్రీ కళాశాలలో సీటు పొందిన విద్యార్థులు ఈ నెల 12వ తేదీలోపు అన్ని ధ్రువపత్రాలతో హాజరై తమ సీటును కన్ఫార్మ్ చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ మొదటి సంవత్సరంలో బీఏ, బీకాం, బీఎస్సీ, బీసీఏ, బీబీఏ, బీఎస్సీ కోర్సుల్లో సీటు పొందిన విద్యార్థులు గడువులోపు హాజరు కావాలని సూచించారు.

కొనసాగుతున్న కౌన్సెలింగ్


నిజామాబాద్ అర్బన్: ఇంజినీరింగ్‌లో ప్రవేశాలకు సంబంధించిన కౌన్సెలింగ్ జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం కొనసాగింది. ఇందులో 65 మంది విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలించారు. అనంతరం విద్యార్థులు వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాల్సి ఉంటుంది. ఈనెల 13వ తేదీ లోపు ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందని కౌన్సెలింగ్ సమన్వయకర్త శ్రీరాంకుమార్ తెలిపారు. ఈనెల 15 తేదీలోపు వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలని పేర్కొన్నారు.

నిజామాబాద్ బీసీ సంక్షేమాధికారిగా స్రవంతి



నిజామాబాద్ అర్బన్: జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారిణిగా స్ర వంతి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె గతంలో ఐసీడీఎస్ పీడీగా జిల్లాలో పనిచేశారు. అనంతరం బదిలీపై వెళ్లి హైదరాబాద్‌లోని సీసీఎల్‌లో పనిచేశారు. తాజాగా పదోన్నతిపై నిజామాబాద్‌కు బీసీ సంక్షేమ శాఖ అధికారిగా వచ్చారు.

సీఎంను కలిసిన మినరల్ కార్పొరేషన్ చైర్మన్



ఖలీల్‌వాడి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని రాష్ట్ర మినరల్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ మంగళవారం హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎంకు పుష్పగుచ్ఛం అందించారు. తనకు మినరల్ కార్పొరేషన్‌చైర్మన్ పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, కాంగ్రెస్ నగరాధ్యక్షుడు కేశ వేణు, కాంగ్రెస్ నేత తిప్పిరెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దత్తతకూ పద్ధతుంది

- చట్టబద్ధం కాని దత్తతతో చిక్కులు
- శిశువులను కొన్నా, అమ్మినా నేరమే..
- నిబంధనల ప్రకారం నడుచుకోవాలంటున్న అధికారులు



సాక్షి, కామారెడ్డి: ఓవైపు పేదరికంతో పాటు ఆడపిల్లలు అంటే భారంగా భావించేవారు పురిట్లోనే శిశువులను వదిలించుకునే ప్రయత్నం చేస్తున్నారు. మరోవైపు వివాహమై ఏళ్ల గడుస్తున్నా సంతానం కలగక చాలామంది మనో వేదనకు గురవుతున్నారు. ఈ ఇద్దరి అవసరాలను ఆసరాగా చేసుకుని దళారులు దందా సాగిస్తున్నారు. దత్తత పేరుతో శిశు విక్రయాలకు పాల్పడుతున్నారు. అయితే చట్టబద్ధం కాని దత్తతతో ఇబ్బందులు తప్పవని హెచ్చరిస్తున్నారు అధికారులు. పిల్లలను పెంచుకోవాలనుకునేవారు పద్ధతులు పాటించాలని సూచిస్తున్నారు.

నిబంధనలివి..

సంతానం లేని దంపతులు ఇక తమకు సంతానం కలగదు అన్న నిర్ణయానికి వచ్చినపుడు దగ్గరి బంధువుల పిల్లలను దత్తత తీసుకోవడం సహజం. రక్తసంబంధీకులు అయినా, బంధువులు అయినా తీసుకునే దత్తతకు చట్టబద్ధత ఉండాల్సిందే. ఒక్కోసారి దగ్గరి బంధువుల పిల్లల్ని దత్తత తీసుకున్నా, తరువాతి కాలంలో ఇరు కుటుంబాల మధ్య మనస్పర్ధలు వచ్చినపుడు దత్తత ఇచ్చిన పిల్లల్ని వాపస్ ఇవ్వమనే గొడవలు కూడా చోటుచేకుంటాయి. అందుకే బంధువుల పిల్లల్ని తీసుకోవాలనుకున్నా చట్టబద్ధంగా తీసుకోవడం ఉత్తమం. దత్తత తీసుకోవాలనుకునే జంట మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉండాలి. జీవితానికి ప్రమాదకరమైన ఎలాంటి అనారోగ్య సమస్యలు ఉండకూడదు. దత్తత తీసుకునే పిల్లలను బాగా చూసుకునేందుకు ఆర్థిక పరిపుష్టిని కలిగి ఉండాలి.

దత్తతకు దేశ వ్యాప్తంగా ఒకే విధానం అమలులో ఉంది. దత్తత తీసుకోవాలనుకుంటున్నవారు సీఏఆర్ఏ (సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ) వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. దంపతుల కుటుంబ వివరాలు, ఆధార్, ఆదాయ, వయసు ధ్రువీకరణ పత్రాలు, చిరునామా, ఆరోగ్య పరీక్షల నివేదికలు అందులో నమోదు చేయాలి. అందులోని ప్రతి నిబంధనను పాటించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ పూర్తయిన తరువాత నిర్దేశిత శిశుగృహకు వివరాలు చేరుతాయి. వెబ్‌సైట్‌లో సమర్పించిన వివరాలతో అధికారులు సంతృప్తి చెందితేనే దత్తత ప్రక్రియ ముందుకు సాగుతుంది. అప్పటికప్పుడు పిల్లల్ని దత్తత ఇవ్వడం కూడా సాధ్యం కాదు. ఆ ఏమవుతుందిలే అన్న ధీమాతో చట్టానికి సంబంధం లేకుండా పిల్లల్ని దత్తత తీసుకుంటే.. భవిష్యత్‌లో సమస్యలు ఎదురయ్యే అవకాశాలుంటాయి. బంధువుల పిల్లల్నే దత్తత తీసుకున్నామని చెప్పినా అది చట్ట వ్యతిరేకమే అవుతుంది. అనాథ పిల్లల్ని తెచ్చుకుని పెంచుకుంటామన్నా కుదరదు. పేద పిల్లల్ని కొనుగోలు చేసి పెంచుకుంటున్నా శిక్షార్హమైన నేరమే అవుతుంది. కొనుగోలు చేసిన వారితో పాటు అమ్మిన వారు, మధ్యవర్తిత్వం చేసిన వారు కూడా శిక్షార్హులవుతారు.

అవగాహన లేక..

అమ్మానాన్న అనే పిలుపు కోసం దంపతులు పరితపిస్తుంటారు. వివాహమై ఏళ్లు గడుస్తున్నా సంతానం కలగకపోవడంతో బాధపడుతుంటారు. అలాంటి వారు పిల్లలను దత్తత తీసుకోవడానికి ఆసక్తి చూపుతారు. దళారులు వీరికి మాయమాటలు చెప్పి దత్తత పేరుతో శిశువులను అమ్ముతున్నారు. దత్తత చట్టాలపై అవగాహన లేనివారు దళారులకు డబ్బులు ఇచ్చి పిల్లలను దత్తత తీసుకుంటుంటారు. అయితే చట్టపరిధిలో లేని దత్తత చెల్లదన్న విషయాన్ని గ్రహించకపోవడంతో భవిష్యత్‌లో ఇబ్బంది పడే అవకాశాలున్నాయి. చట్టపరిధిలో లేని దత్తతతో పలువురు ఇబ్బందిపడ్డ సంఘటనలు ఎన్నో ఉన్నాయి. కొన్నిచోట్ల బిడ్డ పెరిగిన తర్వాత తన బిడ్డ తనకు కావాలంటూ కన్నతల్లి గొడవలకు దిగిన ఉదంతాలూ ఉన్నాయి. ఎంతో ప్రేమగా పెంచుకున్న బిడ్డ తన ఒడి నుంచి జారిపోతున్నపుడు పెంచుకున్న తల్లి గుండెలు అవిసిపోక తప్పదు. అలాగే బిడ్డను అమ్మిన, కొనుగోలు చేసిన తల్లిదండ్రులు చట్టం దృష్టిలో నేరస్తులుగా నిలవాల్సి వస్తుంది. చట్ట పరిధిలో లేని దత్తతలతో ఇరు కుటుంభాలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఏర్పడతాయి. ఇటీవల కామారెడ్డి పట్టణంలోని ఓ ఆస్పత్రి అడ్డాగా అప్పుడే పుట్టిన శిశువు విక్రయం కేసులో ఆస్పత్రి యజమాని, వైద్యులు, సిబ్బంది, మధ్యవర్తితో పాటు తల్లి, దత్తత తీసుకున్న వ్యక్తులపైనా కేసులు నమోదైన విషయం తెలిసిందే.

కొనుగోలు చేయడం తప్పు



సంతానం లేని కొందరు దంపతులు అవగాహన లోపంతో పిల్లలను కొనుగోలు చేసి పెంచుకుంటుంటారు. కొందరు బంధువుల పిల్లలను దత్తత పేరుతో తీసుకుంటుంటారు. ఈ రెండు విధానాలూ తప్పే.. కొన్నవారితోపాటు అమ్మినవారూ ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. చట్ట ప్రకారమే పిల్లలను దత్తత తీసుకోవాలి.

– బావయ్య, జిల్లా సంక్షేమాధికారి, కామారెడ్డి

చట్ట ప్రకారం దత్తత పొందాలి



సంతాన లేమితో బాధపడుతున్నవారు ఎవరో ఒకరిని తెచ్చుకుని పెంచుకుంటామంటే కుదరదు. దానిని చట్ట వ్యతిరేక చర్యగానే భావిస్తారు. బంధువుల పిల్లల్ని దత్తత తీసుకోవాలనుకున్నా సరే దానికి కూడా ఒక పద్ధతి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వాధీనంలోని కారా వెబ్‌సైట్‌లో పిల్లల దత్తత గురించి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అన్నీ సక్రమంగా ఉంటే నిబంధనల ప్రకారం దత్తత ఇస్తారు.

– స్రవంతి, డీసీపీవో, కామారెడ్డి

చిన్నారులకు ఆనందాన్ని పంచండి

- వేడుకలను బాలసదనంలో జరుపుకోండి
- ప్రజలకు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పిలుపు
- విధులకు హాజరు కాని ఉద్యోగిపై చర్యలకు ఆదేశం



చిన్నారులకు నోట్‌బుక్స్ అందిస్తున్న కలెక్టర్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: తమ సంతోషాలు, వేడుకలను బాలసదనం చిన్నారులతో జరుపుకొని వారికి ఆనందాన్ని పంచాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన జిల్లా కేంద్రంలోని బాలసదనాన్ని సందర్శించారు. సదనంలోని గదులు, వసతులను పరిశీలించారు, బాలికలతో మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలు, ఆహారం, విద్యాబోధన తదితర అంశాలను తెలుసుకున్నారు. పరిసరాలను ఎల్లవేళలా పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. బాలసదనంలో విద్యుత్ సమస్య లేకుండా చూడాలని, అన్ని ఫ్యాన్‌లు పనిచేసేలా చూసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల, ఉద్యోగుల హాజరు పట్టికను పరిశీలించారు. చాలా రోజులుగా విధులకు హాజరు కాని అవుట్ సోర్సింగ్ ఉద్యోగి(అటెండర్) హేమలతను విధుల నుంచి తొలగించాల ని ఆదేశించారు. నైట్ వాచ్‌మన్ కచ్చితంగా సాయంత్రం 4 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు బాలసదనంలోనే ఉండాలన్నారు. మెనూ ప్రకారం ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రి భోజనం అందించాలని బాల సదనం సూపరింటెండెంట్ సంగమేశ్వరిని ఆదేశించారు. బాలికలకు కుట్టు శిక్షణ ఇప్పించాలన్నారు. చదువుతో పాటు పిల్లలకు ఆటలు నేర్పించాలన్నారు. చైల్డ్ లైన్ టోల్ ఫ్రీ నంబర్ 1098 కు వచ్చే ప్రతి ఫోన్ కాల్‌కు వెంటనే స్పందించాలని ఆదేశించారు. బాలసదనపు చిన్నారుల తో పుట్టిన రోజుల వేడుకలు, ఇతర పండగలు జరుపుకోవాలని భావించేవారు డీసీపీవో (94924 75105)ను సంప్రదించాలని సూచించారు. అనంతరం చిన్నారులకు నోటు పుస్తకాలను అందించారు. కార్యక్రమంలో కామారెడ్డి ఆర్డీవో రంగనాథ్, ఐసీడీఎస్ పీడీ బావయ్య, సీడబ్ల్యూసీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, డీసీపీవో స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి బల్దియా చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం



వివరాలు తెలుపుతున్న ఆర్డీవో ప్రభాకర్

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణపై కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసం నెగ్గిందని ఆర్డీవో మన్నె ప్రభాకర్ తెలిపారు. మున్సిపల్ చైర్మన్‌పై కౌన్సిలర్లు ఏప్రిల్ 27న అవిశ్వాస నోటీసులు ఇవ్వగా.. మే 18న అవిశ్వాస పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. అయితే అవిశ్వాస నోటీసులు సక్రమంగా లేవని చైర్మన్ హైకోర్టును ఆశ్రయించారు. అవిశ్వాస పరీక్ష నిర్వహించడానికి అనుమతించిన కోర్టు.. ఫలితాన్ని మాత్రం వెల్లడించవద్దని సూచించింది. దీంతో ఆర్డీవో అవిశ్వాస పరీక్షను నిర్వహించి ఫలితాన్ని ప్రకటించలేదు. స్టే తొలగించాలని కౌన్సిలర్లు హైకోర్టులో రిట్ పిటిషన్ వేశారు. కోర్టు ఈనెల 3న స్టే ఎత్తివేస్తూ తీర్పు వెలువరించింది. అవిశ్వాస పరీక్ష ఫలితాన్ని ప్రకటించాలని సూచించడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో మంగళవారం ఫలితాన్ని ప్రకటించారు. మున్సిపల్ చైర్మన్‌కు వ్యతిరేకంగా 11 మంది కౌన్సిలర్లు చేతులు లేపారని పేర్కొన్నారు. దీంతో సత్యనారాయణ పదవీచ్యుతులయ్యారన్నారు. నివేదికను కలెక్టర్‌కు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు, కౌన్సిలర్లు శ్రీకాంత్, సాయిలు, శ్రీనివాస్, నీలకంఠం, భూదేవి, మహేశ్వరి, బాలమణి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

'కులాలకు అతీతంగా ఏకం కావాలి'



మాట్లాడుతున్న అప్పాల ప్రసాద్

కామారెడ్డి అర్బన్: హిందువులందరూ కులాలకతీతంగా ఏకమై దేశ ప్రగతికి దోహదపడాలని సామాజిక సమరసత వేదిక తెలంగాణ ప్రాంత సంయోజక్ అప్పాల ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని కళాభారతి ఆడిటోరియంలో ఆర్ఎస్ఎస్ కామారెడ్డి నగర శాఖ ఆధ్వర్యంలో గురుపూజ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా యోగా, ప్రకృతి వైద్యులు తిరుపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అప్పాల ప్రసాద్ మాట్లాడుతూ వేద కాలం నుంచి ప్రపంచానికి సంపద, సంస్కృతి, సంప్రదాయాలు ఇచ్చిన దేశం మనదన్నారు. హిందువులలో ఐక్యత లోపించడంతో కాలక్రమంలో విదేశీయుల దాడులు, మత మార్పిడులు జరిగాయన్నారు. కులాలకతీతంగా హిందువులంతా ఏకమైతే దేశం అఖండ శక్తిగా ఎదుగుతుందన్నా రు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ జిల్లా సంఘచాలక్ శంకర్, నగర సంఘచాలక్ కొమిరెడ్డి స్వామి, ఎమ్మెల్యే వెంకటరమణరెడ్డి పాల్గొన్నారు.

తీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవు

- కేజీబీవీ సిబ్బందికి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు హెచ్చరిక
- సమయానికి భోజనం అందించాలని సూచన



నాగిరెడ్డిపేట కేజీబీవీలో సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): విద్యార్థులకు సమయానికి భోజనం, నాణ్యమైన విద్యను అందించకపోతే చర్యలు తప్పవని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు హెచ్చరించారు. నాగిరెడ్డిపేట కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఆదివారం ఆలస్యంగా అల్పాహారం అందించిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కేజీబీవీని తనిఖీ చేశారు. ఆ సమయంలో ప్రిన్సిపాల్ వీణ అందుబాటులో లేకపోవడంపై సిబ్బందిని ప్రశ్నించారు. పాఠశాల పనిమీద కామారెడ్డి వెళ్లారని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అనురాధ తెలిపారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ప్రతి ఆదివారం భోజనం సమయానికి అల్పాహారం పెడుతున్నారని, మాడిపోయిన చపాతీలు ఇస్తున్నారని విద్యార్థులు పేర్కొన్నారు. రోజూ వడ్డించే భోజనం సైతం నాణ్యతగా ఉండడంలేదని ఫిర్యాదు చేశారు. అనంతరం ఎమ్మెల్యే ఉపాధ్యాయులు, సిబ్బందితో మాట్లాడారు. సిబ్బంది తీరుమార్చుకోవాలని, సమయానికి అల్పాహారం, భోజనం అందించాలని సూచించారు. లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఆయన గోపాల్‌పేట మోడల్ స్కూల్‌ను తనిఖీ చేశారు. పాఠశాలలోని రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, నాయకులు రాంచందర్‌రెడ్డి, లక్ష్మణ్, ఇమాం, కిష్టయ్య, శ్రీరామ్ గౌడ్, షాహెద్‌పాషా, పర్వతరావు, సురేందర్‌గౌడ్, గులాం, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీలత తదితరులు ఉన్నారు.

లక్ష్యం మేరకు మొక్కలు నాటాలి

- నాటిన మొక్కలకు జియో ట్యాగింగ్ చేయించాలి
- వీసీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ జిల్లా అధికారులు

కామారెడ్డి క్రైం: లక్ష్యం మేరకు మొక్కలు నాటాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఆమె హైదరాబాద్‌నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో మాట్లాడారు. వనమహోత్సవం, మహిళా శక్తి, సీజనల్ వ్యాధులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పనులు, ధరణి దరఖాస్తులు, ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాల పంపిణీ, ఉద్యోగుల సాధారణ బదిలీలు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనువైన స్థలాలను గుర్తించి విరివిగా మొక్కలు నాటాలన్నారు. నాటిన ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ చేయించాలన్నారు. ఆగస్టు నెలాఖరు నాటికి నిర్దేశిత లక్ష్యాలను చేరుకునేలా కార్యాచరణ రూపొందించాలన్నారు.

మహిళా శక్తిలో భాగంగా విద్యార్థులకు ఏకరూప దుస్తులు కుట్టే బాధ్యతలను మహిళా స్వయం సహాయక సంఘాలకు అందించామని సీఎస్ తెలిపారు. నెల రోజుల్లో రెండో జత స్కూల్ యూనిఫామ్‌లను కూడా కుట్టించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళలు డెయిరీ, పౌల్ట్రీ, క్యాంటీన్ లాంటి యూనిట్‌లు ఏర్పాటు చేసుకోవడానికి, చిన్న తరహా పరిశ్రమలు, స్థానిక పరిస్థితులకు అనువుగా ఉండే వ్యాపారాలు ప్రారంభించడానికి ప్రభుత్వ పరమైన తోడ్పాటును అందించాలన్నారు. సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వర్షపు నీరు, మురుకి నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డెంగీ, మలేరియా, అతిసారా, విష జ్వరాలు లాంటి వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఆరోగ్య కేంద్రాల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ఎరువుల కృత్రిమ కొరత రాకుండా చూసుకోవాలన్నారు. గ్రామాల్లో రైతు భరోసా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా చేపట్టిన పనులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ధరణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలన్నారు. ఉద్యోగుల సాధారణ బదిలీలను ఈనెల 20 వ తేదీలోగా పూర్తి చేయాలని సూచించారు.

అప్రమత్తంగా ఉండాలి

సీజనల్ వ్యాధుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. సీఎస్‌తో వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడారు. వన మహోత్సవంలో భాగంగా లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు నాటాలన్నారు. జిల్లాలో ఎక్కడా ఎరువులు, విత్తనాల కొరత తలెత్తకుండా చూడాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. వచ్చే వారం జిల్లాలో కేంద్ర జలశక్తి సంఘం అధికారుల పర్యటన ఉన్నందున అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో నిఖిత, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవోలు, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో మెరిసిన మద్నూర్ వాసి


విశ్వజిత్ కాంబ్లే

మద్నూర్: జూనియర్ హిందీ లెక్చరర్ పోటీ పరీక్షల ఫలితాల్లో మద్నూర్‌కు చెందిన విశ్వజిత్ కాంబ్లే రాష్ట్ర స్థాయిలో నాలుగవ ర్యాంకు సాధించినట్లు కుటుంబీకులు మంగళవారం తెలిపారు. విశ్వజిత్ 450 మార్కులకు 340.859 మార్కులు సాధించారు. గ్రామానికి చెందిన విశ్వజిత్ జూనియర్ లెక్చరర్ ఉద్యోగం సాధించడంపై గ్రామస్తులు, పలువురు అభినందనలు తెలిపారు.

గ్రాప్లింగ్‌లో విద్యార్థికి బంగారు పతకం



పిట్లం: మండల కేంద్రంలోని ప్రతిభ హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని ప్రతిభ భుటాన్ దేశంలో జూన్ 26న నిర్వహించిన అంతర్జాతీయ గ్రాప్లింగ్ టోర్నమెంట్‌లో బంగారు పతకం సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రతిభను ఎంపీ సురేశ్ షెట్కార్ నారాయణ్‌ఖేడ్‌లోని తన నివాసంలో మంగళవారం సన్మానించారు. త్వరలో నిర్వహించే ప్రపంచస్థాయి పోటీల్లో ప్రతిభ మరిన్ని గోల్డ్‌మెడల్స్ సాధించి దేశానికి మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు. ప్రతిభ హైస్కూల్ నిర్వాహకుడు నర్సింగ్‌రావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పట్టణ పోలీసులు మంగళవారం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కళాశాల గ్రౌండ్‌లో విద్యార్థులతో మాట్లాడారు. సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. నేరాలకు గురయితే వెంటనే 1930కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. ఆఫర్లు, బహుమతులు అంటూ వచ్చే మెసేజ్‌లను నమ్మవద్దని, ఓటీపీలు ఎవరికీ చెప్పవద్దని సూచించారు.

సీడీసీ చైర్మన్‌గా షాదుల్



నిజాంసాగర్(జుక్కల్): మాగి గాయత్రి కార్మాగారం సీడీసీ చైర్మన్‌గా ఎండీ షాదుల్‌ను నియమిస్తూ రాష్ట్ర షుగర్ కేన్ కమిషన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలం జంబ్గి(బి) గ్రామానికి చెందిన ఎండీ షాదుల్ చైర్మన్‌గా నియామకమయ్యారు. తనపై ఉన్న నమ్మకంతో సీడీసీ చైర్మన్‌గా నియమించిన ఎంపీ సురేశ్‌షెట్కార్, ఎమ్మెల్యేలు లక్ష్మీకాంతరావు, సంజీవ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఏజీపీగా సాయిప్రకాశ్ దేశ్‌పాండే



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ)గా సాయిప్రకాశ్ దేశ్‌పాండెను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని కోర్టు న్యాయవాదులు మంగళవారం పేర్కొన్నారు. ఎల్లారెడ్డి సీనియర్ న్యాయవాదిగా ఉన్న సాయి ప్రకాశ్ దేశ్‌పాండెను తాత్కాలికంగా ఏజీపీగా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని అన్నారు.

భోజనం మాది.. నీళ్లు మీవి!

- మద్నూర్, డోంగ్లి మండలాల్లోని అనేక పాఠశాలల్లో నీటి వసతి కరువు
- బాటిళ్లలో నీళ్లు తెచ్చుకుంటున్న విద్యార్థులు
- అధికారుల నిర్లక్ష్యంపై తల్లితండ్రుల ఆగ్రహం

కార్పొరేట్ స్థాయి విద్య.. సకల సౌకర్యాలు.. ప్రభుత్వ పాఠశాలల్లోనే మీ పిల్లలను చేర్పించండి.. ఇదీ ప్రతిసారి ప్రజాప్రతినిధులు, అధికారులు చెప్పే మాటలు. కానీ.. వాస్తవ పరిస్థితులు ఇందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. మద్నూర్, డోంగ్లి ఉమ్మడి మండలాల్లోని అనేక ప్రభుత్వ పాఠశాలల్లో కనీసం తాగునీరు కూడా అందని పరిస్థితి. అంతేగాకుండా ఇతర సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు అనాసక్తి చూపుతున్నారు.

మద్నూర్(జుక్కల్): మద్నూర్, డోంగ్లి ఉమ్మడి మండల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు తాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మధ్యాహ్న భోజన సమయంలో పిల్లలు తెచ్చుకునే బాటిళ్లలో నీళ్లు అయిపోతే ఇక వారు పడే బాధ చెప్పలేనిది. ఉమ్మడి మండల్లాలోని మారెపల్లి, మల్లాపూర్, అవాల్‌గావ్, దోతి, సిర్‌పూర్, మద్నూర్ తదితర ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో బోర్లు వేయించలేదు. బోర్లు ఉన్న పాఠశాలల్లో అవి పనిచేయక దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. అంతేకాకుండా పాఠశాలల్లో ఏర్పాటు చేసిన జలమణి పథకం అటకెక్కింది. దీంతో మధ్యాహ్న భోజనం వేళ దప్పిక తీర్చుకునేందుకు అలమటిస్తున్నారు. నివాస ప్రాంతాలకు దూరంగా పాఠశాల దూరండగా ఉండడంతో విద్యార్థులు బరువైన పుస్తకాల బ్యాగులతో పాటు, నీటిబాటిళ్లను మోసుకెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు కల్పించి, నాణ్యమైన విద్య, సౌకర్యాలు అందిస్తామన్న అధికారుల మాటలపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి కోసం రూ. లక్షలు వెచ్చిస్తున్నామని చెబుతున్నా కనీస సౌకర్యాలు సమకూరకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా పాఠశాలల్లో తాగునీటి వసతి కల్పించి ఇబ్బందులను తీర్చాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు. పాఠశాలల్లో తాగునీటి ఇబ్బంది విషయమై పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులను వివరణ కోరగా కొన్ని పాఠశాలల్లో నీటి సౌకర్యం లేదని, బోర్లు పనిచేయడం లేదన్నారు. సమస్య పరిష్కారమై ఉన్నతాధికారులకు నివేదికలు పంపించినట్లు వారు పేర్కొన్నారు.


మద్నూర్‌లో ఇంటి నుంచి నీళ్ల బాటిళ్లు తెచ్చుకున్న విద్యార్థులు

వ్యాపారంలో మెలకువలు తెలుసుకోవాలి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఐకేపీ డీపీఎం

డిచ్‌పల్లి: వ్యాపారంలో మెళకువలు తెలుసుకుంటే ఆర్థికంగా అభివృద్ధి సాధించవచ్చని ఐకేపీ డీపీఎం సాయిలు సూచించారు. మండల కేంద్రంలోని ఎస్బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఈడీపీ(ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం) కార్యక్రమానికి డీపీఎం హాజరై మాట్లాడారు. ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు వ్యాపారం అభివృద్ధి చెందడానికి ఉపయోగపడతాయన్నారు. ఇంట్లో ఉంటూనే స్వయం ఉపాధితో వ్యాపారం చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ సంస్థలో శిక్షణ పొందిన ఎంతో మంది మహిళలు జీవితంలో స్థిరపడ్డారని పేర్కొన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంస్థ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్, సిబ్బంది భాగ్యలక్ష్మి, రామకృష్ణ, నవీన్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎంనే ఎత్తుకెళ్లారు

- రూ. 3.95 లక్షలు చోరీ
- మహారాష్ట్ర వైపు పరారైన దొంగలు
- చోరీకి వినియోగించిన క్వాలిస్ వాహనం గుర్తింపు

నిజాంసాగర్(జుక్కల్): ఏకంగా ఏటీఎం నే ఎత్తుకెళ్లిన చోరీ ఘటన కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండల కేంద్రంలో మంగళవారం తెల్లవారుజామున 3.20 గంటల ప్రాంతంలో చోటు చేసుకుంది. బిచ్కుంద మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న ఎస్బీఐ ఏటీఎంకు గుర్తుతెలియని ఆరుగురు దొంగలు క్వాలిస్ వాహనంలో వచ్చారు. నలుగురు ఏటీఎం రూమ్ వద్దకు వెళ్లి ఏటీఎంను పెకిలించి బయటకు తీసుకొచ్చారు.

అందరు కలిసి క్వాలిస్ వాహనంలో ఏటీఎం చేర్చారు. ఏటీఎం చోరీకి పాల్పడుతున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి పోలీసులకు సమాచారం అందించగా, పెట్రోలింగ్‌లో ఉన్న బిచ్కుంద పోలీసులు హూటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు. అయితే అప్పటికే ఏటీఎంతో సహా దొంగలు వాహనంలో పరారయ్యారు. దొంగలు జుక్కల్ చౌరస్తా, బాలాజీ నగర్, ఖండెబల్లూర్, పెద్ద ఎడ్గి, గుల్లా మీదుగా మహారాష్ట్ర వైపు వెళ్లినట్లు వారి వాహనం సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యింది. పెద్ద ఎడ్గి గ్రామంలో రెండు బైక్‌లను సైతం దొంగలు దొంగిలించి తీసుకుపోయారు. ఏటీఎం దొంగతనానికి ఉపయోగించిన క్వాలీస్ వాహనాన్ని మహారాష్ట్ర సరిహద్దులోని బీంరా తండా వద్ద వదిలి వెళ్లారు. అక్కడి నుంచి మరో వాహనంలో పరారయినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న బ్యాంకు మేనేజర్ మోహన్‌రావు ఏటీఎం కేంద్రానికి చేరుకున్నారు. ఏటీఎంలో రూ. 3.95 లక్షలు ఉన్నట్లు మేనేజర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు బిచ్కుంద ఎస్సై మోహన్ రెడ్డి తెలిపారు. బాన్సువాడ డీఎస్పీ సత్యనారాయణ ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఏటీఎం చోరీకి సంబంధించి సీసీ టీవీలో రికార్డు కావడంతో పోలీసులు విచారణ చేపట్టారు.


ఏటీఎం గదిని పరిశీలిస్తున్న డీఎస్పీ సత్యనారాయణ

కేజీబీవీలో కళాబృందం ప్రదర్శన


అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

భిక్కనూరు: మండలంలోని జంగంపల్లిలో ఉన్న కేజీబీవీలో సైబర్ నేరాలపై షీటీం బృందం సభ్యులు ప్రదర్శన నిర్వహించారు. సైబర్ నేరాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఎవరైనా ఓటీపీలు, బ్యాంకు, ఏటీఎం వివరాలు అడిగితే చెప్పొద్దని సూచించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నీటి నమూనాల సేకరణ



రెంజల్: రెంజల్, తాడ్‌బిలోలి, వీరన్నగుట్ట గ్రామాల్లో మంగళవారం జల్ జీవన్ మిషన్ కేంద్ర ప్రభుత్వ బృందం సభ్యుడు పర్యటించి నీటి నమూనాలను సేకరించారు. ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామస్తులకు తాగునీరు అందించే నల్లాల నీటిని సేకరించి పరిశీలించారు. విద్యార్థులు సురక్షితమైన నీటిని సేవించాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం నీటి సమూనాలను సేకరించి స్వచ్ఛమైన తాగు నీటిని అందించేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ మున్నినాయక్ తెలిపారు. కేంద్ర బృందం ప్రతినిధితో పాటు ఎంపీడీవో శ్రీనివాస్, ఏఈలు గబ్బర్‌సింగ్, చంద్రకాంత్, ల్యాబ్ టెక్నీషియన్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థికి కరెంట్ షాక్



నిజామాబాద్‌అర్బన్: నగరంలోని సారంగాపూర్ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం విద్యుత్‌షాక్‌తో విద్యార్థినికి గాయాలయ్యాయి. పాఠశాల ఆవరణలో ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్‌వైర్లకు ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థిని సులోచన చేయి తగలడంతో గాయాలయ్యాయి. ఆమెను వెంటనే ఉపాధ్యాయులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధిత విద్యార్థినికి మెరుగైన వైద్యం అందించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ప్రభుత్వ ఆస్పత్రి అధికారులను ఆదేశించారు.

పర్యవేక్షణ కరువు

పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీ ద్వారా పనులు జరుగుతుండగా విద్యుత్ వైర్లు ఎక్కడికక్కడే వేలాడుతున్నాయి. సరైన పర్యవేక్షణ లేకపోవడంతోపాటు విద్యుత్ వైర్లు వేలాడుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఉపాధ్యాయులపై జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

పాఠశాల ఆవరణను శుభ్రంగా ఉంచాలి



ఎల్లారెడ్డిలో హాజరు పట్టికను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, చెరువు కట్ట పనుల వివరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

ఎల్లారెడ్డిరూరల్: పాఠశాల ఆవరణ శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ప్రిన్సిపాల్ సుధాకర్‌ను ఆదేశించారు. మైనారిటీ బాలుర గురుకుల పాఠశాలను ఎమ్మెల్యే మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులు, వంటశాల, ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులు కింద కూర్చుని ఉండడాన్ని చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలకు కావాల్సిన ఫర్నీచర్ వివరాలు తనకు అందించాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. సిబ్బందితో మరోమారు సమావేశం నిర్వహిస్తానని, విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. ఎమ్మెల్యే వెంట కౌన్సిలర్ సత్యనారాయణ, పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు సాయిబాబా, వినోద్‌గౌడ్, నాయకులు ఆరిఫ్, షెకావత్, వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

ఎల్లారెడ్డి: మినీ ట్యాంక్ బండ్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. ఎల్లారెడ్డి చెరువుకట్ట వద్ద జరుగుతున్న మినీ ట్యాంక్ బండ్ నిర్మాణ పనులను పరిశీలించారు. పనులకు సంబంధించి రెయిలింగ్, వాకింగ్ ట్రాక్, లైటింగ్ పనులను వేగవంతం చేయాలన్నారు. ఎమ్మెల్యే వెంట నీటిపారుదల శాఖ డీఈ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్, నాయకులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

సదాశివనగర్: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు అన్నారు. మండల కేంద్రంతో పాటు ఉత్తునూర్‌లో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. కార్యక్రమాల్లో పార్టీ మండల అధ్యక్షుడు జూకంటి సంగారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గాదారి శ్రీనివాస్‌రెడ్డి, లింగాగౌడ్, సంపత్ గౌడ్, ఇర్షాదొద్దీన్, రూపేందర్‌రెడ్డి, లింగారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నరేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తాత, మనవరాలికి పాముకాటు

- బాలిక మృతి
- చికిత్స పొందుతున్న తాత


జోడు వైష్ణవి(ఫైల్)

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): రేకులషెడ్డులో నిద్రిస్తున్న తాత, మనువరాలిని కట్లపాము కరిచిన ఘటనలో మనువరాలు మృతిచెందగా తాత ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. నాగిరెడ్డిపేట మండలంలోని జాప్తిజాన్కంపల్లిలో మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకున్న సంఘటన వివరాలిలా ఉన్నాయి. జాప్తిజాన్కంపల్లి గ్రామానికి చెందిన జోడు సంగమేశ్వర్ రెండో కూతురు వైష్ణవి(7), తన తాత జోడు శంకరయ్య(60)తో కలిసి సోమవారం రాత్రి రేకులషెడ్డులో నిద్రించింది. అర్ధరాత్రి దాటాక వైష్ణవితోపాటు శంకరయ్యను పాము కరిచింది. నిద్రలేచిన వారు లైటువేసి గమనించగా పాము కనిపించడంతో దాన్ని కుటుంబ సభ్యుల సహాయంతో కొట్టిచంపారు. అనంతరం పాముకాటుకు గురైన వైష్ణవి, శంకరయ్యలను ఎల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం కామారెడ్డి ఆస్పత్రికి తరలిస్తుండగా వైష్ణవి మృతిచెందింది. శంకరయ్యను సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైష్ణవి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని బాలాజీ నగర్‌తండాలో పాము కాటుతో మృతి చెందిన కమల కుటుంబానికి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు మంగళవారం ఆర్థికసాయం అందించారు. పాముకాటుతో మృతి చెందిన కమల కుటుంబ సభ్యులను పరామర్శించారు. కమల కుటుంబానికి ప్రభుత్వం నుంచి అన్నివిధాలా ఆదుకుంటామన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి మృతి

మోర్తాడ్(బాల్కొండ): ట్రాక్టర్‌ను దాటేక్రమంగా మరో వాహనాన్ని తప్పించబోయి బైక్ అదుపుతప్పిన ఘటనలో మహిళ మృతి చెందింది. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్‌కు చెందిన భార్యాభర్తలు ఆకుల లింగన్న, ఆకుల లక్ష్మి తమ కూతురిని హైదరాబాద్ వెళ్లేందుకు మంగళవారం ఆర్మూర్‌లో బస్సు ఎక్కించారు. తిరిగి ఇంటికి వస్తుండగా దొన్కల్ క్రాస్‌రోడ్డు వద్ద ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో లక్ష్మి (40) మృతి చెందింది. ఉన్నత చదువుల కోసం పంపించిన కూతురు హైదరాబాద్‌కు చేరకముందే తల్లి రోడ్డు ప్రమాదంలో మరణించడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు.

డ్రెయినేజీలో పడి కార్మికుడు..

బాన్సువాడ : డ్రెయినేజీలో పడి మున్సిపల్ కార్మికుడు మృతి చెందిన ఘటన పట్టణంలోని తాడ్కోల్ రోడ్డులో చోటు చేసుకుంది. మున్సిపాలిటీ కార్మికుడు గంగాధర్(39) సోమవారం రాత్రి అతిగా మద్యం సేవించి కల్వర్టుపైనే పడుకున్నాడు. అర్ధరాత్రి నిద్రలో ఉన్న అతడు డ్రెయినేజీలో పడి ఊపిరాడక మృతి చెందాడు. మంగళవారం ఉదయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కృష్ణ తెలిపారు.


గంగాధర్ (ఫైల్)

రెండు వాహనాలు ఢీ.. ఒకరికి తీవ్రగాయాలు

నిజామాబాద్‌రూరల్: రెండు వాహనాలు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్రగాయాలైనట్లు రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో మహేశ్ తెలిపారు. విద్యుత్‌శాఖలో పని చేస్తున్న తిరుపతి సోమవారం రాత్రి మానిక్‌బండార్ నుంచి కంఠేశ్వర్ వైపు ద్విచక్రవాహనంపై వస్తుండగా, గుపన్‌పల్లి వద్ద జోహార్‌పాషా అనే వ్యక్తి బైక్‌పై అతివేగంగా వచ్చాడు. రెండు వాహనాలు ఢీకొనడంతో తిరుపతికి తీవ్రగాయాలయ్యాయి. బాధితుడి తమ్ముడు గోపి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

రూ.43 లక్షల విలువైన గుట్కా పట్టివేత

డిచ్‌పల్లి, జిల్లా కేంద్రంలో సీజ్

డిచ్‌పల్లి/ఖలీల్‌వాడి: జిల్లాలోని డిచ్‌పల్లి, నిజామాబాద్‌నగరంలో పోలీసులు మంగళవారం భారీ ఎత్తున నిషేధిత గుట్కాను మంగళవారం పట్టుకున్నారు. వ్యాన్‌లో తరలిస్తున్న రూ.39లక్షల విలువైన గుట్కాను డిచ్‌పల్లి మండలం మెంట్రాజ్‌పల్లి శివారులోని 44వ నంబర్ జాతీయ రహదారిపై పట్టుకున్నారు. వాహనంతోపాటు డ్రైవర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు.

జిల్లా కేంద్రంలో..

నిజామాబాద్ నగరంలోని కిసాన్‌గంజ్‌లో ఉన్న ఓ ఏజెన్సీపై టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడి చేసి రూ.4లక్షల విలువైన గుట్కాను స్వాధీనం చేసుకున్నారు. గుట్కా నిల్వ చేసిన ఏజెన్సీ యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు.


వ్యాన్ డ్రైవర్‌ను విచారిస్తున్న డిచ్‌పల్లి పోలీసులు

లింగంపేటలో..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని రెండు పాన్‌షాపులపై దాడి చేసి నిషేధిత గుట్కాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. ఇద్దరిపై కేసులు నమోదు చేశామన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు కారణాలతో నలుగురి బలవన్మరణం

రుద్రూర్ మండలంలో ఘటనలు

రుద్రూర్: మండల కేంద్రంతోపాటు రెండు గ్రామాల్లో వేర్వేరు కారణాలతో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. మండల కేంద్రంలోని స్వీట్ షాపులో పని చేస్తున్న యువకుడు, చిక్కడ్‌పల్లిలో మహిళ, రాయకూర్‌లో వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నారు. ఆయా ఘటనలకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి..

పెళ్లి క్యాన్సిల్ అయ్యిందని..


కైలాస్ మృతదేహం

నిశ్చితార్థం అయిన తరువాత పెళ్లి క్యాన్సిల్ అయ్యిందని మనస్తాపానికి గురై కైలాస్(20) అనే యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రాజస్తాన్‌కు చెందిన కైలాస్ మండల కేంద్రంలోని ఓ స్వీట్‌హోమ్‌లో పని చేస్తున్నాడు. ఇటీవలే అతడికి నిశ్చితార్థమైంది. ఆ తరువాత పెళ్లి క్యాన్సిల్ కావడంతో మనస్తాపానికి గురయ్యాడు. సోమవారం రాత్రి సహచరులతో కలిసి గదిలో నిద్రించిన కైలాస్ రాత్రి వేళలో ఉరేసుకున్నాడు. స్వీట్‌హోమ్ యజమాని సుఖ్‌రాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అప్పారావు తెలిపారు.

అనారోగ్యంతో మహిళ..

మండలంలోని చిక్కడపల్లికి చెందిన ఎర్రోళ్ల రేణుక (48) జీవితంపై విరక్తి చెంది ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై అప్పారావు తెలిపారు. రేణుక గత కొంతకాలంగా నరాల బలహీనత, తలనొప్పితో తీవ్రంగా ఇబ్బంది పడుతోందని, ఈ క్రమంలో సోమవారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుందని ఆమె భర్త శంకర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు సేవించి వృద్ధుడు..

మండలంలోని రాయకూర్ గ్రామానికి చెందిన కాంతపు పోశెట్టి (60) పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై అప్పారావు తెలిపారు. కాళ్లవాపు కారణంగా గత కొంత కాలంగా నడవలేక పోతున్న పోశెట్టి జీవితంపై విరక్తి చెంది సోమవారం పురుగుల మందు సేవించాడు. గమనించిన కుటుంబ సభ్యులు బోధన్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి కుమారుడు శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అప్పులబాధతో యువకుడు..


దేవరాజు (ఫైల్)

దోమకొండ: అప్పులబాధ తాళలేక మండలంలోని ముత్యంపేటకు చెందిన ఆశబోయిన దేవరాజు(23) ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఉపాధి నిమిత్తం ఐదేళ్ల క్రితం దుబాయికి వెళ్లిన దేవరాజు రెండేళ్ల తరువాత గ్రామానికి తిరిగివచ్చి డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల కాలంలో పని లేకపోవడం, అప్పులు పెరగడంతో జీవితంపై విరక్తి చెందాడు. ఈ క్రమంలో తాను ఆత్మహత్య చేసుకుంటానని చెప్పి మంగళవారం ఉదయం ఇంట్లో నుంచి బయటికి వెళ్లాడు. ఆందోళనకు గురైన సోదరుడు స్వామి తన తమ్ముడు దేవరాజు ఆచూకీ కోసం వెతుకగా గ్రామశివారులోని వ్యవసాయబావి వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

యువతి అదృశ్యం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): పట్టణానికి చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు ఎస్సై మహేశ్ మంగళవారం తెలిపారు. కళాశాలకు వెళ్తున్నానని చెప్పి సోమవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన యువతి తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారు. కళాశాలకు సైతం రాలేదని సిబ్బంది తెలిపారు. దీంతో సదరు యువతి తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



రుద్రూర్: పొతంగల్ మండలం హంగర్గా గ్రామం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను తహసీల్దార్ మల్లేశ్ సోమవారం రాత్రి పట్టుకున్నారు. మండలంలోని మంజీరా నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం మేరకు తహసీల్దార్ రెవెన్యూ సిబ్బందితో కలిసి దాడి చేసి తిర్మలాపూర్ క్రాసింగ్ వద్ద ట్రాక్టర్లను పట్టుకున్నారు. మూడు ట్రాక్టర్లను కోటగిరి పోలీస్ స్టేషన్‌కు తరలించి బోధన్ ఆర్డీవోకు సమాచారం అందించినట్లు తహసీల్దార్ తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తే రెవెన్యూ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. వాహనాలను సీజ్ చేయడంతోపాటు ఆర్టీవో, మైనింగ్ శాఖల నిబంధనల మేరకు జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు.

గంజాయి విక్రేత అరెస్ట్


ఎక్సైజ్ పోలీసుల అదుపులో ఉన్న నిందితుడు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని సిద్దులగుట్ట వెనుక ప్రాంతంలో ఉన్న ఓ రెస్టారెంట్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్న మహ్మద్ వాహిద్ అలీని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ స్టీవెన్‌సన్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేయగా, పెర్కిట్‌కు చెందిన మహ్మద్ వాహిద్ అలీ వద్ద 800 గ్రాముల ఎండు గంజాయి పట్టుబడిందన్నారు. అతడిని విచారించగా నాందెడ్ నుంచి ఒక కేజీ ఎండు గంజాయిని తీసుకొచ్చి 200 గ్రాముల చొప్పున చిన్న చిన్న ప్యాకెట్లుగా మార్చి విక్రయిస్తున్నట్లు తెలిపారు. అలాగే రెస్టారెంట్ పరిసర ప్రాంతంలో గంజాయి సేవిస్తున్న నలుగురిని ఆర్మూర్ తహసీల్దార్ గజానన్ ఎదుట బైండోవర్ చేశారు. దాడిలో ఎక్సైజ్ సిబ్బంది ధర్మేందర్, సందీప్, వికాస్‌గౌడ్, నరేశ్, సాయిబాబా పాల్గొన్నారు.

ఫోన్ బుక్ చేస్తే బెల్టొచ్చింది..

- ఆన్‌లైన్ మోసానికి గురైన వ్యవసాయ కూలీ


బాధితుడు జీవన్

నవీపేట: రూ.25వేల సెల్‌ఫోన్ ఆన్‌లైన్‌లో రూ.5వేలకే వస్తోందనే ఆశతో బుక్ చేసిన వ్యక్తికి పార్సిల్‌లో బెల్ట్ వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని శివతండాకు చెందిన వ్యవసాయ కూలీ మెగావత్ జీవన్‌కు 15 రోజుల క్రితం ఫోన్ కాల్ వచ్చింది. రూ.25వేల విలువ చేసే ఫోన్ మీకు కేవలం రూ.5వేలకే వస్తుందని, వెంటనే ఆర్డర్ చేయాలని అవతలి వ్యక్తి నమ్మించడంతో జీవన్ ఆర్డర్ చేశాడు. మంగళవారం పార్సిల్ రావడంతో విప్పి చూసిన జీవన్‌కు బాక్స్‌లో బెల్ట్ కనిపించడంతో ఖంగుతిన్నాడు. తాను మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.